క్లుప్తంగా

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి



గణపవరంలో ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: అపరిశుభ్రమైన పరిసరాలు దోమల వ్యాప్తికి ప్రధాన కారణమని, దోమల నిర్మూలనతో అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. శుక్రవారం గణపవరం పట్టణంలోని నాలుగు సచివాలయాల పరిధిలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లు, పరిసర ప్రాంతాలను పొడిగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, వారానికి ఒకసారి పొడి వారంగా పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేశారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే



ఆరోగ్య సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఉచిత వైద్యం అంద జేస్తుందని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జె.విల్సన్ అన్నారు. ఈ వైద్య సేవలను అందరూ వినియోగించుకోవాలని కోరారు. శుక్రవారం గణపవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నాలుగు సచివాలయాల పరిధిలో ఇంటింటా ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను నమోదు చేసుకున్నారు. వచ్చేనెల ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తామని, సంబంధిత సమస్యలున్న వారు వైద్యులతో పరీక్షల చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు యోహాన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కాఫీ విత్ క్లాప్ మిత్ర



ఉంగుటూరు ఎస్‌డబ్ల్యూఎం షెడ్డు వద్ద కాఫీ విత్ క్లాప్ మిత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు, వెల్లమిల్లి గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాలు ఆయా ఎస్‌డబ్ల్యూఎం షెడ్ల వద్ద శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగి పలు అంశాలపై చర్చించారు. ఉంగుటూరులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి బందారు సింధు, కార్యదర్శి గిరిధర్, ఎంపీడీవో ఆంజనేయులు, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. వెల్లమిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి కుమార్ రాజా, సొసైటీ అధ్యక్షుడు మల్లరెడ్డి శేషగిరిరావు, సచివాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో 8 మంది అరెస్టు

దెందులూరు: దెందులూరు- అలుగులగూడెం గ్రామాలకు చెందిన ఇరువర్గాల కొట్లాట ఘటనపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదవడంతో విచారణలో భాగంగా శుక్రవారం ఎనిమిది మందిని అరెస్టు చేశామని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. విచారణాధికారి నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ కేసు విచారించి ముద్దాయిలను భీమడోలు కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ ఎనిమిదికి రిమాండ్ విధించారని ఎస్సై ఐ.వీర్రాజు అన్నారు.

నేడు ఏలూరులో చినవెంకన్న కల్యాణం

ద్వారకాతిరుమల: ఏలూరు జూట్‌మిల్ సమీపంలోని ధర్మభేరి ప్రాంగణంలో శనివారం చినవెంకన్న కల్యాణాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు చెప్పారు. వేడుకలో భాగంగా స్వామివారి ధర్మ ప్రచార రథం ఉదయం ఆలయం నుంచి బయల్దేరి ధర్మభేరి ప్రాంగణానికి చేరుకుంటుందన్నారు. ఉత్సవం పూర్తయిన తర్వాత తిరిగి ఆలయానికి చేరుకుంటుందని చెప్పారు. భక్తులు ఈ వేడుకలో పాల్గొనాలని కోరారు.

పోలీస్ విధులపై అవగాహన

ఏలూరు టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల స్పందన, పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహణపై స్కూల్ చిన్నారులకు పోలీస్ సిబ్బంది వివరించారు. డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగరంలోని ఒక ప్రైవేటు స్కూల్ చిన్నారులకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడితే స్టేషన్‌లోని వైర్‌లెస్ సిస్టమ్ ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బందికి సమాచారం ఏ విధంగా చేరవేస్తారనే విషయాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విస్తృత సేవలు

పెదపాడు: అంగన్‌వాడీల్లో ప్రభుత్వం విస్తృత సేవలు అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ కే విజయలక్ష్మి తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా పెదపాడులోని తెలగాలపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఫాతిమా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పెంపొందుతుందని సంపూర్ణ పోషకాహారం పథకంలో రాగి పిండి, అటుకులు, బెల్లం, ఎండు ఖర్జూరం, వేరుశనగ చిక్కీలు, గుడ్లు, పాలు, కందిపప్పు, నూనెతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తోందన్నారు. లబ్ధిదారులు మాత్రమే వాటిని వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలను లబ్ధిదారులకు వివరించాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు సెక్టారు సూపర్‌వైజర్ షేక్ ఫాతిమా మునిషా బేగం అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.



పెదపాడు: అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి



పెదవేగి: వేగివాడలో పోషకాహారంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మేరీ బాయమ్మ

పోషకాహారంతో రక్తహీనత దూరం

పెదవేగి : గర్భిణులు, బాలింతలు ఎక్కువగా రక్తహీనతకు గురవుతుంటారని, దీని నుంచి బయటపడాలంటే పోషకాహారం తీసుకోవాలని వేగివాడ సెక్టార్ సూపర్‌వైజర్ మేరీ బాయమ్మ అన్నారు. పెదవేగి మండలం వేగివాడలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మా కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార లోపంతో వచ్చే సమస్యలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సాధారణంగా తీసుకునే ఆహారం కంటే అదనపు ఆహారం తీసుకోవాలన్నారు. అప్పుడే తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని ఆమె సూచించారు. దీంతోపాటు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ వేగివాడ సెక్టారు సూపర్‌వైజర్ మేరీ బాయమ్మ, తానింకి సుధారాణి, ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు త్రివేణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న గణేశ్ ఉత్సవాలు

దెందులూరు: మండలంలో గ్రామగ్రామాన వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వినాయకుని ఆలయాల్లో, కూడళ్లల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పందిళ్లల్లో స్వామివారికి భక్తులు పూజలు నిర్వహించారు. శుక్రవారం అన్ని గ్రామాల్లో ఉత్సవాల నిర్వహణతో పాటు శ్రీరామవరంలో వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వార్డు మెంబర్లు, గ్రామస్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల వద్ద ఆశీర్వచనాలు తీసుకున్నారు.

నేడు ఆటల పోటీలు ప్రారంభం

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గం అండర్-14,17 బాలురు, బాలికల ఆటల పోటీలు ప్రారంభమవుతాయని నియోజకవర్గ కోఆర్డినేటర్, ఫిజికల్ డైరెక్టర్ రాజగోపాల్, కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శర్మ తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ప్రారంభిస్తారని వివరించారు.

ఉత్తమ భవిష్యత్తు దిశగా ప్రతి విద్యార్థీ అడుగేయాలి



లాంగ్ జంప్ చేసేందుకు పరుగుతీస్తున్న బాలిక



హైజంప్ చేస్తున్న బాలుడు

పెదవేగి : క్రీడల్లో ప్రతిభ విద్యార్థిని ఉన్నతస్థాయిలో నిలుపుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి సాధన చేయాలని పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. దెందులూరు నియోజకవర్గం స్థాయిలో నిర్వహిస్తున్న 14, 17 ఏళ్ల విభాగం క్రీడాపోటీలు పెదవేగి గురుకుల విద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాన్ని సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలన్నారు. విద్యార్థి జీవితంలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ప్రతి విద్యార్థి మరింత మెరుగైన ప్రతిభతో ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు. నియోజకవర్గ కోఆర్డినేటర్ రాజగోపాల్, మండల కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున్, రఫీ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా గృహ లబ్ధిదారుల ఎంపిక

దెందులూరు : మండలానికి త్వరలో నూతన జగనన్న గృహాలు మంజూరు కానున్నాయని, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వైఎస్సార్ సీపీ నాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో కుల, మత, పార్టీ, వర్గాలకు అతీతంగా అర్హత ప్రాధాన్యతగా లబ్ధిదారులను గుర్తించాలని జెడ్పీటీసీ అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు ఆదేశాల మేరకు పకడ్బందీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఇల్లు లేని, అద్దె ఇళ్లల్లో ఉంటున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత గూడు ఉండాలన్న లక్ష్యాలు అధిగమించాలన్నారు. త్వరలో మంజూరు కానున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఎంపికలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎంపీడీఓ ఎబీపీవీ లక్ష్మి సూచించారు. మంజూరైన పథకాలు లబ్ధిదారులకు తెలియజేసే ప్రక్రియలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సమీక్ష సమావేశంలో వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, గొల్ల నాగరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.



దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు

సాల్మన్‌రాజు సేవలు మరువలేనివి

భీమడోలు: సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాల్మన్‌రాజు మృతి కార్మిక లోకానికి తీరని లోటని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలులో సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాల్మన్‌రాజు సంస్మరణ సభను నిర్వహించారు. సాల్మన్‌రాజు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ఓదార్చారు. మండల అధ్యక్షురాలు జి.స్వర్ణకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభకు వి.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎస్‌వీడీ ప్రసాద్ హాజరై సాల్మన్ రాజు సేవలను కొనియాడారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు స్వచ్ఛందంగా అందించిన రూ.50వేల చెక్కును సాల్మన్‌రాజు కుటుంబ సభ్యులకు అందజేసారు. పి.భారతి, పి.రాజారావు, కట్టా భాస్కరరావు, జి.మోహన్, ఆది, కృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.



సాల్మన్‌రాజు కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న వి.ఉమామహేశ్వరరావు తదితరులు

ఘంటా ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఖండన

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్‌పై టీడీపీ నాయకుడు, గౌడ సంఘ నాయకుడు చలమోలు అశోక్‌గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘ నాయకులు, బీసీ నేతలు ముక్త కంఠంతో ఖండించారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 21న దెందులూరులో నిర్వహించిన టీడీపీ నిరసన దీక్షలో అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ఘంటా ప్రసాద్‌పై వ్యక్తిగత దూషణలు చేయడంతో పాటు అసభ్య పదజాలాన్ని ఉపయోగించడం అత్యంత హేయమైనదిగా అభివర్ణించారు. ఘంటా ప్రసాద్ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పనిచేస్తూ అంచెలంచెలుగా ఈ స్థాయికి ఎదిగారని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అంతా పర్యటించి బీసీల్లో ఐక్యతను పెంపొందించి పార్టీ బలోపేతానికి కృషి చేశారని వివరించారు. ఆయన పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగానే ప్రసాద్ సతీమణి పద్మశ్రీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని అప్పగించారని వివరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవంటూ దుష్ప్రచారం చేయడంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం అశోక్ గౌడ్‌కు తగవని హితవు పలికారు. ఘంటా ప్రసాద్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దెందులూరు నియోజకవర్గ గౌడ, బీసీ నాయకులు కట్టా యేసుబాబు, మేకా లక్ష్మణరావు, తాతా సత్యనారాయణ, బెజవాడ నరసింహారావు, పి.అచ్యుత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నేతలు

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ఏలూరు టౌన్: మద్యం సేవించి ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపినా, సరైన ధ్రువ పత్రాలు లేకుండా రోడ్లపైకి వచ్చినా చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఆయన తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహించారు. కార్లు, మోటారు సైకిల్‌పై ప్రయాణించే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. పలువురు సరైన ధ్రువపత్రాలు చూపించకపోవటంతో చలానాలు విధించటంతోపాటు, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, మోటారు సైకిళ్లపై ప్రయాణించేవారు లైసెన్సు, వాహన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. మితిమీరిన వేగంతో ప్రయాణించకుండా కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని తెలిపారు.



వాహనాల తనిఖీ చేస్తున్న సీఐ రాజశేఖర్

పిల్లలను తిరిగి స్కూళ్లలో చేర్పించాలి

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో బడి బయట ఒక్క పిల్లాడు కూడా ఉండకూడదని, వయస్సు వారీగా, తరగతుల వారీగా ప్రతి ఒక్కరికీ విద్య అభ్యసించేలా చర్యలు చేపట్టాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కమిషనర్ జీతఆర్పై సమీక్షా సమావేశం నిర్వహించారు. 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి తిరిగి స్కూళ్లలో చేర్పించాలని, వయస్సు పైబడిన వారిని ఓపెన్ స్కూల్లో చేర్పించాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు తిరిగి తర్ఫీదు ఇప్పించి ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో చేర్పించి వారిలోని నైపుణ్యాలను వెలికితీయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో యువత, విద్యార్థులను గుర్తించి వారికి విద్యతో కలిగే ప్రయోజనాలు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నగరంలోని వార్డు సచివాలయం ఎడ్యుకేషన్ సెక్రటరీలు, వలంటీర్లు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ వెంకటకృష్ణ

ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన సదస్సు

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల రైతుల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా అమలు చేస్తున్న రాయితీలను రైతులు అవగాహన పెంపొందించుకుని సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు నియోజకవర్గ ఉద్యానవనశాఖాధికారి బీ.కిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పండ్ల తోటలు, కూరగాయలు, పూల మొక్కల సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. మామిడికి ఎకరాకు రూ. 7,980, జామకు రూ.17,599, బత్తాయి, నిమ్మకు రూ.962, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.30 వేలు, పనస, నేరేడు తోటలకు రూ. 18 వేలు, కూరగాయల తోటలకు రూ.20 వేలు, పామాయిల్ ఒక మొక్కకు రూ.193, కోకో ఎకరాకు రూ. 12 వేలు అందిస్తుందన్నారు. బొప్పాయి, అరటి, కొబ్బరి శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు సబ్సిడీపై రుణాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు భూమిలో తేమను కాపాడుతూ కలుపు మొక్కల నివారణకు ప్లాస్టిక్ కవర్ల ఏర్పాటుకు రూ. 16 వేలు, 16 లీటర్ల సామర్థ్యం కలిగిన తైవాయిన్ స్ప్రేకు రూ.8 వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. రైతులు ఈ రాయితీలు పొందడానికి మొక్కలు కొన్న బిల్లు, ఆధార్ జెరాక్స్, బ్యాంకు అకౌంట్ జెరాక్స్, రైతు భరోసా కేంద్రాలు, ఉద్యానవన శాఖ గ్రామ, మండల అధికారులను సంప్రదించాలని నియోజకవర్గ ఉద్యానవన శాఖాధికారి బీ.కిరణ్ అన్నారు.

నేడు భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ శనివారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పెదవేగి మండలంలోని భోగాపురం సచివాలయం పరిధిలో మధ్యాహ్నం 3:30 గంటల నుంచి రాత్రి 9:30 వరకు నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జానంపేట బాబు కోరారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట స్థావరంపై దాడి చేసి వారి నుంచి రూ.9,890 నగదు, 6 సెల్‌ఫోన్లు, 3 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని వేంపాడులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఏలూరు జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు శుక్రవారం స్థావరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పేకాట శిబిరంపై దాడి చేసారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,890 నగదు, 6 సెల్‌ఫోన్లు, 2 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని పెదపాడు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

బుట్టాయగూడెం: పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈనెల 30వ తేదీ నుంచి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్లు కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. నూతిరామన్నపాలెంలో శుక్రవారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు నేపథ్యంలో ఈనెల 15వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో ఇంటింటికీ సర్వే కార్యక్రమాన్ని వైద్య సిబ్బందితో చేపట్టినట్లు చెప్పారు. 9 అంశాలకు సంబంధించి వైద్య పరీక్షలు, వ్యాధుల గురించిన వివరాలను ప్రజల ద్వారా తెలుసుకుని ఆ వివరాలను జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌లో పొందపర్చడం జరుగుతుందని చెప్పారు. కేఆర్ పురం డిప్యూటీ డీఎంహెచ్ఓ మేరీ కేథరిన్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

ఉంగుటూరు: భారతదేశం అన్ని రంగాల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి చెందుతూ అంతర్జాతీయ శక్తిగా ఎదుగుతోందని గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సేవా వారోత్సవాల్లో భాగంగా నారాయణపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉచిత దంత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఉషోదయ పాఠశాలలో నా మొక్క నా శ్వాసలో మొక్కలను నాటారు. మోదీ పాలనపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గారపాటి ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాదు, జిల్లా ఉపాధ్యక్షుడు నగరపాటి సత్యనారాయణ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి పాల్గొన్నారు.



నారాయణపురంలో ఉచిత వైద్య శిబిరంలో దంత పరీక్షలు చేస్తున్న వైద్యుడు

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కామవరపుకోట: మండలంలో జీలకర్రగూడెం గ్రామ పరిధిలోని కోదండ రామనగర్, కంఠమనేనివారి గూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ పరిశీలించారు. అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున వారికి అందాల్సిన పోషకాహారం సరఫరా, స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే ఆహారాన్ని, ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని సిబ్బందికి సూచించారు. కోదండరాం నగర్ కేంద్రంలో సిబ్బంది యూనిఫారంలో లేకపోవడం, విద్యార్థులు భోజన సమయానికి కేంద్రానికి చేరుకోవడం, అప్పటి వరకు విద్యార్థులకు హాజరు వేయకపోవడంపై అంగన్‌వాడీ సిబ్బందిని హెచ్చరించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ విజయకృష్ణ

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని కొవ్వూరు రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. బస్టాండ్ నుండి దళితవాడ మీదుగా జయప్రద హాస్పిటల్ రోడ్డు ఎదుటి వరకు ఈ డ్రెయినేజీని నిర్మిస్తున్నట్లు ఎంపీటీసీ గంటా శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు డ్రెయినేజీ సమస్యను ఎమ్మెల్యే బాలరాజుకు వివరించడంతో ఆయన ఆదేశాల మేరకు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్ కుమార్ తెలిపారు.



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు